మతవైషమ్యం .

# రెండు గుండు దెబ్బలు!!



డి. వి. ఎస్. శాస్త్రి

ఆమె నల్లగా ఉంటుంది. నల్లగా ఉంటేనేం?

నల్లటి నీటిమేఘాలు ఆకాశాన్ని ఆక్రమించినప్పుడు మనోజ్ఞంగా ఉండదూ? తత్ జలధర ప్రచోదిత శీతలవాయువులు మానసికాహ్లాదాన్ని ఈయలేదూ?

రజియా వీధి వరండాలో కుర్చీమీదకూర్చొని మార్క్సు వ్రాసిన "కాపిటల్" చదువుతోంది. మధ్యమధ్య చదువు ఆపి దీర్ఘంగా ఆలోచిస్తోంది. తత్త్వవిజ్ఞానంలో మార్క్సు ఎంత విప్లవం కలుగజేసేడు? ఏ కాయకష్టం ఎరుగని తనకు జీవిత సౌఖ్యాలన్నీ అందుబాటులో ఉన్నాయి. కాని చెమటూడ్చి పనిచేస్తూన్న ఆ తోటమాలీలు రోజల్లా కష్టపడి ఇంటికి వెళ్తే సౌఖ్యాలేటుండ నిచ్చి కష్టపడడానికి కావలసిన బలాన్ని ఇచ్చే తిండికూడ ఉండదుకదా! ప్రభుత్వ ఉన్నతోద్యోగంలో ఉన్న తన తండ్రి ఈ బీదల గురించి ఎప్పుడైనా తలుస్తాడా? మహమ్మదీయుడైనా కుమార్తెయైన తనకు పర్దా తొలగించి ఉన్నత విద్యను అభ్యసింపజేసే మనోవికాసం ఉన్నా రాజకీయంగా అతని మనస్తత్వం ఎట్టిదో!

రజియా ఈరీతిగా ఆలోచిస్తూండగా మదన్ మోహన్ కారు దిగాడు. నిరాడంబరుడు. [illegible]గానికి లేని అందాన్ని చేకూర్చిన అతని చిరునవ్వు, పవిత్రత, ఉన్నతాశయాలు తొంగిచూసే నయనాలు ఎదుటివారిని ఆకర్షిస్తాయి. చిరపరిచితల్లా ఇద్దరూ పలుకరించుకున్నాక

"ఇది పవిత్రమైన రోజు. సరిగ్గా నెలరోజుల క్రితం నువ్వు చేసిన వాగ్దానం జ్ఞాపకం ఉందా?" అని మదన్ అడిగాడు.

కొంత తడవాలోచించి రజియా ప్రశ్నించింది.

"ఏమి వాగ్దానం?"

"వాక్కుతో కాకపోతే, మౌనంతో దానం చేసేవు—నీ హృదయాన్ని"

"నా మౌనం అర్ధాంగీకార సూచకం కాదు; ఆలోచనా సూచకం కాని. నా జీవితంలోని ముఖ్యావస్థలో ఒక ప్రధాన సమస్యని ఎదుర్కోడానికి సమయం తీసుకోవలెనని నువ్వు కూడ ఒప్పుకోక తప్పదు. ఇంతకీ, మదన్, ఒక్కమారాలోచించు. ఆగస్టు 15 తర్వాత మన దేశం ఎన్ని క్లిష్టసమస్యలకు గురియౌతుంది! మనం ప్రపంచంలో గర్వింపదగ్గ జాతిగా నిలబడాలీ అంటే యువతీ యువకులమీద ఎంతభారం పడి ఉంది!! అట్టి సమయంలో స్వార్థం తలపెట్టి ప్రేమ అన్న అర్థంలేని ఆవేశానికి ప్రాధాన్యం ఈయడం నీలాంటి యువకులకు సమంజసంకాదు.

"నువ్వు ప్రేమని అంత చులకనగా చూడ్డం బాగులేదు. నీచేతిలో ఉన్న పుస్తకాన్ని వ్రాసిన మార్క్సు తన ఉత్కృష్టకార్యాన్ని నెరవేర్చడానికి కారణాలలో ఒకటి భార్యయొక్క ప్రేమపూరిత త్యాగంకాదూ! ప్రేమ లెనిన్‌లో ఎంత ఉద్రేకాన్ని, ఎంత ఉత్సాహాన్ని కలుగజేసింది!! గాంధీజీ......"

"ఆగు, ఆగు. జీవితంలో విజయం పొందిన మహాపురుషుల జీవితకథలు చదివేటప్పుడు ఇంపుగా ఉండడంకోసం ప్రేమకి, ప్రేయసికి కొంత ఉత్కృష్టత యిచ్చేరు రచయితలు. కీర్తిదీప్తిలో వెలిగిన కొద్దిమందిని కాదు మనం చూడవలసినది. ఎంతోమంది ప్రజ్ఞావంతులు ప్రేమవల్ల, భార్యవల్ల జీవితాన్ని పాడుచేసుకున్నారు! సంసారాంధకారంలో పడిఉండడం వారిని మనం చూడలేకుండా ఉన్నాం. అంతే భేదం. ఇంతకీ, ఆశయ

విజయానికి బాహ్యపరిస్థితుల నెదిరించగలిగే ధైర్యము, త్యాగము అవసరము కాని భార్య యొక్క ప్రేమ కాదు."

"అయితే ఆఖరికి నువ్వన్నదానికి అర్థం ఏమిటి?" అని ఆతృతతో ప్రశ్నించేడు మదన్.

"రజియా అన్నదానికి అర్థం దాని మాటల వల్ల తెలియలేదూ! ఇద్దరూ వెనక్కి చూసేరు. రజియా తండ్రి గదిగుమ్మందగ్గర నిలబడి ఉన్నాడు.

"మదన్, రజియాని నువ్వింక మర్చిపో. దేశ విభజనానంతరం పాకిస్తాన్ వెళ్ళడానికి కోరుకొన్నాను. రజియా మాటల కర్థం ఇదే" అన్నాడతడు.

మదన్‌మోహన్ విస్మయం పొందేడు. జఫ్రుల్లా ఖాన్ పాకిస్తాన్ కోరుకుంటాడని మదన్ ఎప్పుడు తలపెట్టలేదు. సాంఘికంగా ముందంజ వేసిన అతడు రాజకీయంగా వెనుకంజ వేసేడని మదన్ ఆశ్చర్యం పొందేడు. కొంతసేపుండి మారు మాటాడకుండా వెళ్ళిపోయాడు.

తండ్రిచర్య రజియాకి విచిత్రంగా కన్పించింది. ఇన్నాళ్లు, సంపూర్ణ స్వేచ్ఛనిచ్చాడు. ఇప్పుడు తన జీవితంలో చేయికలుగచేసుకొంటున్నాడే!! దేశ సౌభాగ్యానికి పాటుపడడంలో అడ్డుపడ్తుందని మదన్ ప్రేమని నిరాకరించి ఆడిన తన మాటలకు మతవైషమ్యం గోచరించే అర్థాన్ని రుద్దడం-అదైనా తన అనుమతి లేనిదే—ఆమెకు రుచించ లేదు. తండ్రి పాకిస్థాన్ కోరుకొన్నాడనికూడ ఆమెకు తెలియదు. విభజనానంతరం సహజంగా హిందూస్థాన్ తన నిజమైన దేశంగా భావిస్తూన్న రజియాయొక్క మానసిక శాంతిని అదురగొట్టింది ఈ సంఘటన.

తండ్రితో అంది

"నా మాటల కర్థం చెప్పడానికి అధికారం నాది కాని మీది కాదు. ఇది మీకు తగనిపని."

"పాకిస్తాన్ ముసల్మానుల దేశం. నువ్వు నా ఉద్దేశంతో ఏకీభవిస్తావని అలా అన్నాను" ప్రేమపూర్వకంగా అన్నాడు ఖాన్.

"విభజన సామ్రాజ్యవాదుల కుట్ర. నా ఆశయం సామాన్యమానవుని జీవితంలో ఆనందదాయకపరిస్థితులను కలుగచేయడం. పాకిస్తాన్, హిందూస్థాన్‌లతో నాకేమీ సంబంధంలేదు" అని చెప్పి వెంటనే అక్కడనుండి వడివడిగా వెళ్ళిపోయింది.

# 2

మదన్ మనస్సులో రజియా ఇంటినుండి వచ్చిన సమయంనుండి ఒక విధమైన పరివర్తనం కలుగనారంభించింది. జ్ఞానభాస్కరుని కప్పిన మబ్బులు తొలగినట్లయింది. ఇన్నాళ్ళూ తానెంత స్వార్థపరత్వంలో మునిగిఉన్నాడూ!! ఇంతమంది బీదలు తిన్నగా కట్టు గుడ్డలేక తిన తిండిలేక తనవేపు దీనంగా చూస్తూఉంటే కారులో వెళ్తూ తాను ఎన్నడైనా ఈ ప్రపంచంలో గణనీయమైన జీవులుగా తలచేడూ? ఎన్నడో స్కూల్లో చదువుకున్న నీతులు—పెద్దలను మన్నించుట, సత్యము పలుకుట, దొంగతనము చేయకుండుట మొదలగునవి—అవే నీతులనుకొని, శ్రద్ధగా వాటిని పాటించి, ప్రేమలో ఉత్కృష్టత చూపాలని రజియాని నిర్మలమనస్కుడై ప్రేమించ మొదలిడి జీవితాన్ని ఆదర్శమార్గంలో నడుపుతున్నానని విశ్వసించే మదన్‌మోహనుడు ఇదికాక వీటికన్నా ఉన్నతస్థానంలో ఉన్న నీతులుకూడ ఉన్నాయి అని మొదటిసారి తెల్సుకున్నాడు.

అప్పటినుండి రాజకీయంలో ఎక్కువ శ్రద్ధ వహించ మొదలుపెట్టేడు. దేశంలోని ప్రజలింత హీనస్థితిలో ఉండటానికి కారణాలు తెల్సుకోటానికి ప్రయత్నంచేస్తున్నాడు. బీదల బస్తీలకి, కార్మికుల ఇళ్ళకి వెళ్ళి స్వయంగా వారి కష్టసుఖాలు తెల్సుకొంటున్నాడు. ఎక్కడెక్కడ ఏ రీతిగా సహాయపడాలో ఆ రీతిగా సహాయపడుతున్నాడు. రాజకీయంగాకూడా విశాలదృష్టి చూపి ఎంతయు ఆవేశంతో, ఉద్రేకంతో పని చేస్తున్నాడు.

ఒకనాటి మధ్యాహ్నం భోజనంచేసి విశ్రాంతి తీసుకొంటూంటే రజియా జ్ఞాపకం వచ్చింది. ఎన్నాళ్ళయింది రజియానుచూచి! రజియాతండ్రి అనుమతి లేనిదే ఆమెను చూడ్డం మర్యాద కాదు. అతడుకదా మతభేదం చూపేడు! అతడుకదా తేటతెల్లంగా చెప్పేసేడు రజియాను మరచిపొమ్మని!! అతడే ఇంటి యజమాని. అట్టి పరిస్థితులలో తాను ఏ మొగం పెట్టుకొని వారింటికి వెళ్తాడూ? దూరదృష్టిగల రజియా మనస్సులో మతవిషయక భేదబుద్ధి అంకురించి ఉండదుకదా!!!




కేసరికుటీరం, లిమిటెడ్., మద్రాసు. 14.

ఒరిస్సా, నైజాము డొమినియన్లు, ఆంధ్రజిల్లాలు, తమిళనాడులకు ఏజెంట్లు —

సీతారామా జనరల్ స్టోర్సు.

బరంపురం-సికంద్రాబాదు-బెజవాడ-మధుర.

ఇలా ఆలోచిస్తూ ఉండగా పోస్టుమాన్ తెచ్చిన ఒక ఉత్తరంమీది చిరునామా రజియా వ్రాతలో ఉంది. ఆత్రుతతో కవరు చింపి లోపలి ఉత్తరం తీసేడు.

"మదన్‌కి,

ఈ వ్యాకోజన్య విచారకరమైన పరిస్థితులలో వెళ్ళిపోయావు. వెళ్ళేదగ్గరనుండి నీ జాడ లేదు. ఎలాగుంటుంది? నా తండ్రి నీయెడల అపరాధం చేసేడు కాని అతని అభిప్రాయంగా తీసుకోకూడదని నా విన్నపం.

నేను పాకిస్తాన్ వెళ్ళకూడదని నిశ్చయం చేసేను. నా తండ్రి వెళ్ళినట్లయితే నా భవిష్యత్తు నేను చూసుకోవలసి ఉంటుంది.

నా మనోవృత్తి నువ్వు పోల్చుకొనే ఉంటావు ఆగష్టు 20 తారీఖున సాయంకాలం 5 గంటలకు నన్ను మా యింటివద్ద కలియవలసింది.

క్షమాపణతో,

ఆగష్టు 16, 1947 రజియా.

తన హృదయంలో ఎంతో బరువు తగ్గినట్లయింది మదన్‌కి. రజియా ఎప్పటిలాగునే ఉంది. మతభేదం ఆమె దృష్టిలో లేదు. కాని అతడు లేని సమయంలో ఆమె తండ్రి మనస్సు తెలిసి వారింటికి ఎలా వెళ్ళడం? అట్టి నడవడి గౌరవాస్పదం కాదు! వెళ్ళకూడదని నిశ్చయం చేసుకున్నాడు. తర్వాత ఎప్పుడైనా వేరే చోటున కలియవచ్చనుకున్నాడు.


## 3

దేశవిభజనానంతరం అతి భయంకరమైన సమయం. హిరోషిమాని అటంబాంబు ధ్వంసంచేసినట్లు కొన్నిప్రాంతాలని మతవైషమ్యం హతమార్చింది. మానవనాగరికతా చిహ్నాలు మాయమయాయి.

రజియా ఈ వార్తలు వింటోంది, విచారిస్తోంది. ఆ పట్టణంలోకూడ పుట్టాయేమో అన్న వదంతులు వస్తున్నాయి.

ఆగష్టు 20 తారీఖున సాయంత్రం 5 గంటలకు ఆమె మదన్ కోసం ఆత్రుతతో నిరీక్షిస్తోంది. అతనితో మాట్లాడి, సంగతులు తెలుసుకొని, కార్యక్రమం ఆలోచిద్దాం అనుకుంది.

5 దాటింది. 6 దాటింది చివరకు 8 కూడా. మదన్ రాలేదు. ఆమె హృదయంలో ఒక భయం



ఏకకాలంలో అనేక రంగుల్ని ముద్రించే కొత్తమాదిరి యంత్రం. దీనిని నడప డానికి ఎట్టి అనుభవం కాని అక్కరలేదు. ఇది బ్రిటిష్ తయారీ.

అంకురించింది. తాను ముస్లిం అని రావడం మానీ లేదు కదా! మదన్ హిందూపక్షపాతి కాదు గదా!!

ఆ మర్నాడు ఖాన్ ఊరినుండి వచ్చి రజియా మనశ్శక్తిని అదురగొట్టేవార్త తెచ్చేడు—ఆమె అన్న, వదినె మతకలహాల్లో వధింపబడ్డారని.

వివిధప్రాంతాలనుండి వచ్చే వార్తాపత్రికలలోని ఘోరమైన వార్తలు, తన ప్రియమైన సోదరుని హత్య, దానికితోడు విశ్వాసపాత్రుడనుకొన్న స్నేహితునిమీద అనుమానం, ఆమెయొక్క సత్యాసత్య విచక్షణ దృష్టిని, ఆలోచనాశక్తిని పూర్తిగా నాశనం చేసేయి.

ఎప్పుడో ఒకప్పుడు కలుద్దాం అనుకొన్న మదన్ ఇంక ఆలస్యం చేయకూడదనుకున్నాడు. పట్టణంలో పరిస్థితులు గమనిస్తే రజియా విషయంలో అవి విషమించవచ్చని తల్చేడు. వెంటనే ఆమెతో ఆలోచించి, ఆమెను భద్రమైన మరొక చోటుకి పంపవలసివుంటుందని త్వరపడ్డాడు.

ఎప్పటికప్పుడు వారి క్షేమానికి భంగం కలుగ వచ్చని ఆయుధాలతో ఆత్మరక్షణకోసం సిద్ధంగా ఉన్నారు రజియా, రజియాతండ్రి. ఎంతో భయంతో భవిష్యత్తుమీద ఆశ వదలి తెగించిఉన్నారు.

అట్టి సమయంలో రజియాను రక్షిద్దామని వచ్చిన మదన్ తలుపు తట్టేడు. మొదట ఎవరూ పలుకలేదు. కొంతసేపటికి ధైర్యం తెచ్చుకొని ఎవరు వారని ప్రశ్నించింది రజియా. మదన్ జవాబిచ్చేడు. మదన్ గొంతుక విని వినడంలో రజియా మనస్సులో మొలకలెత్తిఉన్న అనుమానం ఒక భయంకరమైన దెయ్యం రూపం దాల్చింది. ఇది ఎంత కుట్ర! మతవైషమ్యాలలో తమ పూర్వస్నేహం ప్రేమ ఆహుతి చేసి హత్యకు పూనుకొన్నాడే! ఎందుకీ క్రూరమైన ప్రపంచంలో జీవించడం!!

అని తలుస్తూ అతి త్వరితంగా రోషాతిశయంతో తలుపుతీసి మదన్ లోపల కాలు పెట్టీపెట్టడంలో రివాల్వరుతో పేల్చింది. ఇదే సమయంలో వీధిలో గుంపులు గుంపులుగా భయంకరమైన అరుపులతో జనం వస్తున్నారు, విని మాన సంరక్షణార్థం తనను తాను కాల్చుకొంది.

విషమపరిస్థితులలో మతిస్థిరం లేకపోయింది రజియాకు. పురోవృద్ధికి రాగల రెండు ఆదర్శ పూరిత జీవితాలు అంతరించాయి.

పాకిస్థాన్, హిందూస్థాన్ యూనియన్లు, రజియా, మదనుల గతినుండి దూరమౌదురు గాక!